# మీ జాబులు - మా జవాబులు

**వేమూరి వేంకట రామనాధంగారు, న్యూయార్క్.**

మిత్రులు శ్రీనివాస్‌కు,

మీరు వ్రాసిన మే 16, 2008 ఉత్తరం, "సంఘమిత్ర" సంచికతో పాటు, వచ్చినది. కృతజ్ఞతలు.

మీరు ఇండియాకు వెళ్ళినా, కొంచెమైన విశ్రాంతి తీసికొనకుండా, అదే పనిగా విద్యా విషయమైన కార్యక్రమాలలో కట్టుబడ్డారని మీ ఉత్తరం వల్ల తెలిసింది. ఇది కార్యలగ్నమైన వ్యక్తికి తప్పదు. మీ "మాథమేటికల్" కార్యక్రమాలు అక్కడివారికి ఆనందం కల్గించి యుంటాయి. ఈ దేశంలో మీరు చేస్తున్న ఆ వృత్తులను గురించి వారికి కొంతగానైనా తెలిసి యుంటుంది.

మే 2008 "సంఘమిత్ర" చక్కగా ఉంది. ముఖచిత్రంతో మొదలుగా ప్రరి పుట, ప్రతి పంక్తి జాగ్రత్తగా చదివిన నాకు తట్టిన తొలి అభిప్రాయం, తెలుగు వ్రాత "మెలికల"పాలవుతున్న యీ రోజులలో ఎంతో ప్రశస్తమైన శైలిని, దాదాపు నూరు శాతం తెలుగు (సంస్కృతంతో కలిసి) పదాలతో, మీరు పట్టం కట్టుతున్నారు.

మీరు మధ్యమధ్య - ఉదాహరణకు పుట 7, 17, 19, 20లలో వ్రాసిన సూక్ష్మ వ్యాఖ్యానాలు రసవంతంగా, నీతి దాయకంగా ఉన్నాయి. మీ అమ్మాయి నాట్యశక్తి, సంఖ్యానురక్తి గమనించి ఆనందించాను. బొమ్మలు బాగున్నాయి.

తెలుగు నాయకులను గురించి, వీలైతే వ్రాయిస్తూ ఉండండి. ఉదాహరణకు బులుసు సాంబమూర్తి, దుర్గాబాయి, సంజీవరెడ్డి, సంజీవయ్య, పట్టాభి. ఈ తరంవారికి ఇది అతి ముఖ్యం.

ఈ పత్రికా కార్యక్రమానికి మీకుగల ఓపిక అభినందనీయము. (దాదాపు అశక్యమైన) పని ఒకటి సాధించండి. మీవలె పట్టుదల, శక్తి గల వారిని కొందరిని సంపాదించండి. ఇది కష్టమని నాకు తెలుసు - ఎందుకంటె ఇందులో శ్రమ తప్ప రొక్కం లేదు!

మీకు తెలుసో లేదో, నేను చిన్నతనంలో - 12 ఏళ్ళనాడు, "బాల విశారద" అనే వ్రాతపత్రిక "సంపాదించాను". దానిలోగల కష్ట(సుఖాలు) నాకు కరతలామలకం. కాని ఆ అనుభవం శాశ్వతమైన యోగ్యముద్రను శాసిస్తుంది. ఇది గడించటం మాత్రం ఎంతో కష్టంతో కూడిన పని.

**ధన్యవాదములు. మేము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకి మీ వంటివారే స్పూర్తి. మీవంటి వారి ఆదరణ, పత్రిక వాసిని పెంచడానికి మీరు అందిస్తున్న సూచనలే మాకు పంచభక్ష్య పరమాన్నాలు.॥ సం॥**

*** *** ***

**పాఠకులకు మనవి**

*మీకు తెలిసిన విషయములను పంపితే, సంఘమిత్ర ద్వారా అది నలుగురితో పంచుకుందాం!*

*ప్రేమ, ఆనందం, విజ్ఞానం, ధనం పంచేకొద్దీ పెరుగుతాయి.*